


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

# *చివరి విడత: మలి సందడి (25)*

*స్నేహానంద లహరి*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–2020లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

చివరి విడత: మలి సందడి (25)

స్నేహానంద లహరి

నేను శ్రీమతికి అభయహస్తాన్ని చూపించి, ఇంట్లోంచి బయటకెళ్లాను.

తలుపు తీస్తే సన్నటి హాలు. ఎడం పక్క బాత్రూం. బాత్రూంకి ఎదురుగా కుడిపక్కన ఒలోముచ్‌కీ గది.

ఓరగా తెరిచి ఉన్న తలుపుకు అవతల నిలబడి కనబడింది ఒలోముచ్‌కీ.

నన్ను చూస్తూనే లోపలకు రమ్మని సైగ చేసి తను లోపలికెళ్లి సోఫాలో కూర్చుంది. తన ఎదుట సోఫాని చూపించి కూర్చోమంది మర్యాదగా.

కూర్చున్నాను కానీ, నాలో ఆత్రుత తన్నుకొస్తోంది. ఐనా తమాయించుకుని ఆమెనే చూస్తున్నాను.

ఏం చెబుతుందో ముందు తననే చెప్పనిద్దామని నా ఆలోచన. కానీ ఆమె ఏం చెబుతుందో నాకు తెలియకనా?

"చీటీ చదివావా?" అందామె.

"ఊఁ" అన్నాను బింకంగా.

"నువ్వేమైనా చెప్పాలా?" అడిగిందామె.

అంటే నాకు ఓ అవకాశమిస్తుందా.... ఆశ మళ్లీ నాలో!

"ఇల్లు కాళీ చెయ్యమని చీటీ పెట్టావ్. ఇప్పటికిప్పుడు మాకిల్లెక్కడ దొరుకుతుంది. పోనీ ఉండేది రెండుమూడేళ్లంటే ఉండేదేమో, మేముండేదేమో – మరికాసిని నెలలు ఈలోగా దేశం కాని దేశంలో ఎన్నిళ్లు మారతాం? అదీ నీలాంటి మంచి లాండ్‌లేడీని వదులుకుని?" ఒక్క గుక్కలో అన్నాను.

ఆమె ప్రసన్నంగానే వింది. జాలిగా నన్ను చూసి, "నాకు నువ్వూ మంచి టెనంటువి. నిన్నొదులుకోవడం నాకిష్టం లేదు. కానీ ఏంచేస్తాం – తప్పదు" అని నిట్టూర్చింది.

"ఎందుకని?" అనడిగాను.

"నేను హార్ట్ పేషెంటుని. గొడవ భరించలేను. నిన్న మీ ఇంట్లోంచి అదో రకం శబ్దం వినిపించింది. నవ్వేమో అనిపించింది కానీ చాలా భయంకరంగా ఉంది. వళ్లు జలదరించిపోయింది. ఏదోలా ఐపోయాను. తేరుకుందుకు కాసేపు పట్టింది. ఇంకోసారి కనుక ఆ నవ్వు వినిపిస్తే నాకు హార్టెటాకొచ్చినా రావచ్చు" అంది ఒలోముచ్‌కీ.

ఆమెనుంచి ఇలాంటి పితూరీ వస్తుందని ఏమాత్రం ఊహించలేదు.

ఆమెకు హార్టెటాక్ తెప్పించగల శబ్దం.... అదీ ఓ నవ్వు... అదీ మా ఇంట్లోంచి...

నిజంగా ఇది తోడేలు–మేకపిల్ల కథే అని రూఢి అయింది. ఆ మాటే అందామనుకుని మరీ మోటుగా ఉంటుందనిపించి ఓ క్షణం తటపటాయించాను.

ఎందుకైనా మంచిదని ఒక్కసారి మనసులో కాలాన్ని వెనక్కి తిప్పి నిన్న రాత్రికి వెడితే, చప్పున స్ఫురించింది నాకు.

నిజమే – హార్టెటాక్ తెప్పిస్తుందనుకోను కానీ, విచిత్రమైన నవ్వొకటి నిన్న రాత్రేకాదు, అప్పుడప్పుడు మా ఇంట్లో వినిపించడం కద్దు.

ఆ నవ్వు మా బాబుది!

ఆ విషయం స్ఫురించగానే నాకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు.

భాగవతంలో శ్రీకృష్ణుడు బాల్యంలో ప్రదర్శించిన దుడుకుతనానికి ముచ్చటపడి ఆ పరమాత్ముడి లీలలుగా చెప్పుకుంటుంటాం. కానీ మన పొరుగింట ఓ బాలకృష్ణుడుంటే భరించగలవారు మనలో ఎందరు?

ప్రతి తల్లీ ఒక యశోద. తన శిశువుని ఆమె బాలకృష్ణుడిగా భావిస్తుంది. ఆ బిడ్డమీద ఎటువంటి పితూరీనీ స్వీకరించదు.

బాల్యంలో ప్రతి బిడ్డకీ కొన్ని ప్రత్యేకతలుంటాయి.

వాటిలో కొన్ని అందరికీ బాగుంటాయి. కొన్ని కొందరికే బాగుంటాయి. కొన్ని తల్లికే బాగుంటాయి.

మచ్చుకి భువనేశ్వర్లో మా కాలనీలో రెండేళ్లలోపు చిన్ని కృష్ణుడొకడుండేవాడు. కృష్ణుడిలాగే వాడు ఎక్కువ మాట్లాడేవాడు కాదు. ఐతే కృష్ణుడిలా చిరునవ్వులు కూడా చిందించేవాడు కాదు. ముఖం చాలా అమాయకంగా మాత్రం ఉండేది.

భర్త ఆఫీసుకి వెళ్లేక ఆమె తన ఇంటి పనులు ముగించుకుని, వాణ్ణి చంకనేసుకుని ఎవరింటికైనా వెళ్లేది.

ఎవరింటికి తీసుకెళ్లినా, వాడు నిశ్శబ్దంగా ఆడుకుంటాడు.

ఎంత నిశ్శబ్దమంటే మొదట్లో పెద్దలు మాటల్లో పడి వాణ్ణి పట్టించుకునేవారు కాదు.

తర్వాత చూస్తే వాడు విహరించిన ప్రతి చోటూ – అప్పుడే భూకంపానికి గురైందా అనిపిస్తుంది.

బెడ్రూంలో మంచంమీద దుప్పట్లతో సహా బట్టలన్నీ చిందరవందర. వంటింట్లో చేతికంకిన డబ్బాల్లో పప్పులు, పోపు సామాన్లు – బాత్రూంలో వాషింగు పౌడర్లు వగైరాలు నేలమీద!

తల్లి అదంతా చూసి యశోదలా ముచ్చటగా నవ్వి, “మా ఇంట్లో ఏ వస్తువునీ మావాడికి అంకనివ్వం. ఇక్కడ అన్నీ అందడంతో రెచ్చిపోయినట్లున్నాడు” అని ఊరుకునేది.

అప్పట్నించీ ఆ బాలకృష్ణుడి లీలలు ముచ్చటగా కాక హెచ్చరికగా కాలనీవాసుల్ని చేరాయి.

ఆ యశోదమ్మ ఎప్పుడు ఎవరింటికొస్తుందో తెలియక ప్రతిఒక్కరూ ముందు జాగ్రత్తగా వస్తువుల్ని పిల్లలకందనంత ఎత్తులో ఉంచడం అలవాటు చేసుకున్నారు. ఐనా ఎక్కడో ఏదో పొరపాటు జరుగుతూనే ఉండేది. బాలకృష్ణుడది అవలీలగా పట్టేసేవాడు.

అలా చాలామంది అనుభవాలు మాకు చేరాయి. శ్రీమతి చాలా పద్ధతి మనిషి కాబట్టి, అందరి అనుభవాల్నీ గుర్తుంచుకుని తగిన చర్యలు తీసుకుంది. అందుకు అవసరమైన సాయం నేనూ చేశాను.

ఆలస్యంగానే ఐతేనేం ఒకరోజు మా ఇంటి వంతూ వచ్చింది.

బాలకృష్ణుడు ఇల్లంతా కలయ తిరుగుతుంటే, వాడికేమీ అందవు కదా అన్న ధైర్యంతో, శ్రీమతి ఆ యశోదమ్మతో కబుర్లలో పడిపోయింది. కబుర్ల మత్తులో ఉన్న వాళ్లని – ఉన్నట్లుండి ఫెళ ఫెళమన్న పెద్ద శబ్దమొకటి ఈ లోకంలోకి తీసుకొచ్చింది.

వెళ్లి చూస్తే మంచం మధ్యలో పెద్ద గొయ్యి.

బాలకృష్ణుడు మంచంమీద ఓ పక్కన నిలబడి ఉన్నాడు. వాడి మొహం అమాయకత్వపు ముద్దలా ఉంది.

అది నాలుగేళ్ల క్రితం చేయించిన టేకు మంచం. ఫ్రేములో అడ్డంగా అమర్చిన మందపు చెక్కల్ని కప్పుతూ ఓ కార్డుబోర్డు షీటు. దానిమీద గట్టిపడ్డ దూదితో ఒత్తయిన పరుపు. దానిమీద కాస్త మందంగా ఉండే దుప్పటి.

మంచం మధ్యలో ఏర్పడిన ఆ గోతిలోకీ దిగి ఉన్నాయి – దుప్పటి, పరుపు. కార్డుబోర్డు షీటు కూడా వంగింది తప్ప ఏమీ పాడవలేదు.

మరి గొయ్యి ఎలా ఏర్పడిందా అని మంచం కిందకి చూస్తే – విరిగిన చెక్కలు రెండు కనబడ్డాయి.

అరితేరిన కరాటే నిపుణుడు కూడా ప్రదర్శనలో విరవడానికి తటపటాయించేటంత మందమైన చెక్కలవి.

శ్రీమతి నమ్మలేనట్లు ఆ విరిగిన చెక్కల్నీ, బాలకృష్ణుణ్ణీ మార్చి మార్చి చూసింది.

వాడప్పుడు శకటాసుర సంహారం చేసిన బాలకృషుడంత అమాయకంగానూ ఉన్నాడు.

చెప్పొద్దూ ఆ క్షణంలో ఆ మొహం అలా కనబడితే శ్రీమతికి ముద్దొచ్చింది.

ఈలోగా యశోదమ్మ కలగజేసుకుని, “మంచం పాతదా?” అనడిగింది.

“చేయించి నాలుగేళ్లయింది” అంది శ్రీమతి పాత కొత్తల నిర్ధారణని ఆమెకే వదులుతూ.

“ఐతే పాతదే!” అని నిర్ధారించిన ఆమె తన బిడ్డ వంక ముచ్చటగా చూసి చంకనేసుకుని వెళ్లిపోయింది.

ఆ సాయంత్రం శ్రీమతి ఆ వివరాలు చెబితే నాకు నమ్మకం కుదరలేదు.

నేను కష్టపడి విరిగిన చెక్కల్ని తాత్కాలికంగా మేకులు కొట్టి అతికించి మళ్లీ మంచాన్ని యథాప్రకారం చేశాను.

ఓసారి మంచంమీదకెక్కి నెమ్మదిగా నడిచి చూశాను. గొయ్యి ఏర్పడలేదు.

తర్వాత శ్రీమతి వారిస్తున్నా వినకుండా మంచంమీద అటూ ఇటూ పరుగుకు కాస్త తక్కువన్నట్లు నడిచాను. ప్రమాదమేం జరుగలేదు.

అంటే అవుకుగా ఉన్నప్పుడు కూడా 48 కేజీల మనిషిని బలంగా ఎక్కి తొక్కినా విరగని చెక్కలవి. కానీ బలంగా ఉన్నప్పుడు 10–12 కేజీల బరువున్న బాలుడి ప్రతాపానికి ఇట్టే విరిగిపోయాయి. ఎవరైనా నమ్ముతారా?

స్వానుభవం కాకపోతే — మేమే నమ్మం!

ఆ తర్వాత ఆ చెక్కల స్థానంలో కొత్తవి వేయించడానికి నెల్లాళ్లు పట్టింది. అందాకా మేం నలుగురం రాత్రిళ్లు అదే మంచంమీద పడుకునేవాళ్లం. అప్పుడప్పుడు ఇటు దొర్లినా, అటు దొర్లినా భయమేసేది కానీ, ఆ చెక్కలు విరగలేదు. విరిగిన చెక్కలు మార్పించడం అవసరమా అన్న అనుమానమొచ్చింది కూడా!

ప్రతి శిశువులోనూ అసామాన్యం అనిపించే ప్రత్యేకతలతో ఓ బాలకృష్ణుడుంటాడనడానికి ఇదో ఉదాహరణ.

చిన్నప్పట్నించీ మా బాబుకి కొన్ని సరదాలున్నాయి. వాటిలో కృత్రిమంగా నవ్వడమొకటి.

వాడికి ఉత్సాహం వస్తే, దాన్ని ప్రదర్శించడానికి కావాలని అదోలా నవ్వేవాడు.

ఆ నవ్వు కొంచెం కీచుగా అదోలా ఉన్నప్పటికీ మాలోని యశోదా నందులకు అది భయంకరంగా ఎప్పుడూ తోచలేదు.

మా వాడికి మొహమాటం కాబట్టి ఆ నవ్వుని మా దగ్గరే తప్ప బయటివాళ్ల వద్ద ప్రదర్శించనూలేదు.

ఇన్నాళ్లకు ఆ నవ్వు మా ఇంటి తలుపుల్ని దాటి ఒలోముచ్‌కీ ఇంటి తలుపుల్ని కూడా దాటుకుని వెళ్లి ఆమెకు కర్ణకఠోరమైంది.

ఇది మేము కలలో కూడా ఊహించని విశేషం.

మేము యశోదా నందులం అనుకోవాలా, లేక ఆమెను పూతన అనుకోవాలా?

కావడానికి ఆమెది పూతన పెర్సనాలిటీయే కూడా! కానీ దేశం కాని దేశంలో ఆశ్రయమిచ్చి మేమంతా కలిసి ఒకచోట ఉండడానికి కారణమైన ఆమెను పూతన అని ఎలా అనుకోగలం?

కానీ ఇప్పుడామె మమ్మల్ని ఇల్లు ఖాళీ చెయ్యమందంటే — ఆ ఉక్రోషంలో తనని పూతన ఆవహించిందా అనుకోకుండా ఉండగలమా?

నాకొక విషయం స్పష్టం కావాలి. ఆమె నిజంగా మా బాబు నవ్వుకి భయపడిందా, లేక శ్రీమతి అన్నట్లు ఇది తోడేలు–మేకపిల్ల కథా?

మొదటిది నిజమైతే అసలు విషయం చెప్పి ఆమె భయం పోగొట్టాలనుకుని, "నువ్వు అనవసరంగా భయపడ్డావు. ఆ నవ్వు మా బాబుది. వాడికి మూడంటే మూడేళ్లు. వాడి నవ్వుకి భయపడ్డావంటే నమ్మడం నాకే కాదు, ఎవరికైనా కష్టం. మమ్మల్ని ఇల్లు ఖాళీ చెయ్యమనడానికి ఇంకేదో కారణముంది. సంకోచించకుండా చెప్పు. పరిష్కారం గురించి ఆలోచిద్దాం" అన్నాను అక్కడికది ఆమె సమస్య కూడా అన్నట్లు.

ఒలోముచ్‌కీ వెంటనే, "అది మీ బాబు నవ్వా? అంత చిన్నపిల్లాడు అంత భయంకరంగా నవ్వగలడంటే నమ్మడం నాకూ కష్టమే. నిజం చెప్పు. ఆ శబ్దానికి కారణం ఇంకేదో ఉంది" అంది తనూ ఇంచుమించు నా తరహాలోనే.

"నేను నిజమే చెబుతున్నా. ఇప్పుడు తెలిసింది – నీ సమస్య ఆ నవ్వే కదా! మాటిస్తున్నాను – మా వాడు మళ్లీ అలా నవ్వకుండా నేను, నా భార్య తగిన జాగ్రత్తలు తీసుకుంటాము" అన్నాను వేడుకోలుగా.

ఒలోముచ్‌కీ తల అడ్డంగా ఊపి, "చిన్నపిల్లల్ని నవ్వకుండా ఆపడం ఎవరివల్లా కాదు" అంది.

"మావల్లనౌతుంది" అన్నాను కాస్త మొండిగానే.

ఆమె నావంక అదోలా చూసి, "సరే, నీ మాట నమ్ముతాను. కానీ రేపే మీ బాబు నవ్వితే?" అంది.

కొంచెం మెత్తబడుతున్న సూచన కనబడ్డంతో తెగించి, "ఆమర్నాడే ఇల్లు కాళీ చేసేస్తాను" అన్నాను చప్పున.

"ఎల్లుండి చేసేది రేపే చెయ్యమన్నాను. అంతేగా!" అంటూ మొదటికొచ్చింది ఒలోముచ్‌కీ.

"సరేలే, రేపట్నుంచి ఇల్లు వెదుక్కోవడం మొదలెడతాను. లేదూ, వారంలోగా నా భార్యాబిడ్డల్ని ఇండియాకు పంపే ఏర్పాటు చేస్తాను. వాళ్లను పంపేస్తే నేనిక్కడుండొచ్చు కదా! అప్పుడు అద్దె కూడా మావాళ్లు రాకముందు ఎంతిచ్చేవాణ్నో అంతే ఇస్తాను" అన్నాను.

'అలా కనబడతావు కానీ, వ్యవహారజ్ఞతలో నువ్వు చాణక్యుడివి' అని కాలేజీ రోజుల్నించీ నా మిత్రులు అనేవాళ్లు. వారి వారి కారణాల్ని బట్టి ఆ మాటలో కొంత స్తుతీ, కొంత నిందా ఉన్నాయి. అదంతా ఇప్పటికి అప్రస్తుతమైన వేరే పెద్ద కథ!

అప్పుడు మాత్రం – నిండా మునిగేక చలేమిటిలే అనే దశలో ఆ మాటనేశాను.

కానీ, ఆ మాటల వెనుక కూడా చాణక్యనీతి ఉన్నదని ఇంటామె స్పందనలో కానీ తెలియలేదు.

ఇల్లు అవసరం కాబట్టి, అప్పట్లో ఆమె అడిగిందానికి మారాడకుండా ఒప్పుకున్నాను కానీ, నాకు ముందున్న టర్కీ అతను అద్దె నాకంటే తక్కువే ఇచ్చేవాడు. ఆతర్వాత నా భార్యాబిడ్డలు వస్తారనగానే మరికొంచెం పెంచిందామె. దానికీ ఒప్పుకున్నాను.

ఇప్పుడు మావాళ్లు వెళ్లిపోతే తనకి రాబడి తగ్గిపోతుంది. నేను కూడా వెళ్లిపోతే మరికాస్త తగ్గిపోతుంది.

ఆ విషయం స్ఫురించినట్లుంది, "ఏంచేస్తాం? ఆరోగ్యంకంటే డబ్బేం ముఖ్యం కాదు కదా" అని కాస్త బింకంగా అని, "ఐతే నీమీద నాకు జాలిగా ఉంది. అద్దె మరో యాభై మార్కులు పెంచు. ఎలాగో సద్దుకుంటాను" అంది.

అంతే, ఆమె బేరానికి దిగుతున్నట్లు నాకు అర్థమైంది.

దాంతో ఒక్కసారిగా నాకు మనసు తేలికపడింది. చెప్పలేనంత ధైర్యమొచ్చింది.

అర్థమౌతూనే ఉంది — ముందు ఆరోగ్యాన్ని ప్రస్తావించి, తర్వాత అద్దె పెంచమనడం 'కృష్ణా రాజకంఠీరవా' అన్నట్లే ఉంది.

కానీ నేనా మాట పైకి అనలేదు. అనడం చాణక్యం అనిపించుకోదు.

ముందామె అవగాహనకు థాంక్సు చెప్పాను. తర్వాత యాభై మార్కులు మాత్రమే పెంచమని చెప్పిన ఆమె ఔదార్యాన్ని మెచ్చుకున్నాను.

అప్పుడు అసలు విషయానికొచ్చి, "నేనిక్కడ పరిశోధనకు రీసెర్చి స్కాలరుగా వచ్చాను తప్ప నాది ఉద్యోగం కాదు. నాకొచ్చేదాన్ని జీతమనరు. స్కాలరుషిప్పు అంటారు. ఆ విషయం నీకు తెలుసు" అని గుర్తు చేశాను.

ఆమె తెలుసన్నట్లు తలూపింది తప్ప, ఐతే నాకేమిటన్నట్లు చూడలేదు.

"నేను ఉద్యోగస్థుణ్ణే అయుంటే, నువ్వడిగిందానికి మరో పాతిక మార్కులైనా కలిపి ఇచ్చి ఉండేవాణ్ణి. నాకు ఎక్కువై కాదు. నువ్వు చాలా న్యాయంగా అడుగుతావని తెలుసు కాబట్టి" అన్నాను.

ఆమె మొహం వెలిగిందే తప్ప, ఆమె చూపుల్లో – వీడు తెలివిగా తప్పించుకుందుకు చూస్తున్నాడన్న భావం వ్యక్తం కాలేదు.

"నాకెంతో కష్టమైనప్పటికీ, నోరు విడిచి అడిగావు కాబట్టి, ఇప్పుడిచ్చేదానికి ఇంకో పాతిక పార్కులు మాత్రం అద్దె పెంచగలను" అన్నాను.

అది కూరగాయల బేరంలా ఉందని తెలిసినప్పటికీ — చిన్నతనంగా అనిపించలేదు.

ఎందుకంటే ఇండియాలో మా లాబొరేటరీ నుంచి రీసెర్చి ప్రాజెక్టుకోసం సెంట్రల్ గవర్నమెంటు డిపార్టుమెంట్లకి ప్రపోజల్ పంపేటప్పుడు అవసరమైనదానికంటే ఎక్కువ అడగడం రివాజు.

అప్పుడు వాళ్లు కూరగాయల బేరం మొదలెడతారు. చివరికి మేమనుకున్నకంటే కొంచెం ఎక్కువే కానీ తక్కువ రాదు.

కూరగాయల బేరం నాకు కొత్త కాదు కానీ, జర్మనీలో కొత్తే అనీ, వాళ్లకి అది నచ్చదనీ ఒక సందర్భంలో నా ప్రొఫెసర్ రాలెక్ స్పందనని బట్టి స్వానుభవమైంది. అది ముమ్ముందు ప్రస్తావిస్తాను.

అప్పుడు మాత్రం ఒలోముచ్‌కీ వెంటనే సరేననేసరికి నేను ఇంచుమించు షాక్ తిన్నాననే చెప్పాలి.

అదామె ఎక్కడ కనిపెట్టేస్తుందోనని హడావుడిగా ఆమెకు థాంక్సు చెప్పి సెలవు తీసుకుని మా గదికి వెళ్లిపోయాను.

ఆ తర్వాత జరిగింది వినగానే శ్రీమతికి షాక్.

మా ఇద్దరికీ తగిలింది షాకే ఐనా, మేము పట్టరాని ఆనందంలో ఉన్నామని గ్రహించి పిల్లలు హుషారెక్కిపోయారు.

బాబు అయితే నవ్వబోయాడు కానీ నేను చటుక్కున వాడి నోరు నొక్కి, "ఈ నవ్వుకే నెలకి పాతిక రూపాయలు ఫైను పడింది. ఇంకెప్పుడూ ఇలా నవ్వకు. నిన్ను ఇండియా పంపించెయ్యాల్సొస్తుంది" అన్నాను.

బాబు పెద్దగా చలించలేదు. నేను తన నోటిమీంచి చెయ్యి తియ్యగానే, "మరి నాతో అమ్మ కూడా వస్తుందిగా" అన్నాడు.

అప్రయత్నంగా వాణ్ణి దగ్గరకు తీసుకుని బుగ్గలమీద ముద్దాడాను.

అభం శుభం తెలియని పసివాడు.

తల్లి తన పక్కనుంటే చాలు, ఈ ప్రపంచంలో దేనికీ భయపడనక్కర్లేదనుకునే అమాయకుడు.

వాడి నవ్వుని అడ్డంగా పెట్టుకుని, మా ఇంటామె నానుంచి నెలకు పాతిక మార్కులు గుంజుతోంది.

మనసెలా ఒప్పిందో అనుకున్నాను కానీ బాలకృష్ణుడు నందయశోదలకు మాత్రమే బాలుడు – అన్న స్ఫురణ కూడా లేకపోలేదు.

ఆ రోజే నేను, శ్రీమతి అనుకున్నాం – పొరపాటున కూడా ఒలోముచ్‌కీకి ఇలాంటి అవకాశం మరొకటి ఇవ్వకూడదని.

ఇప్పుడు సుందరం బెర్లిన్ నగరానికి తనతోపాటు భార్యను కూడా తీసుకొస్తే ఓ నాలుగు రోజులు మా ఇంట్లో ఉండడానికి వీలవుతుందా అని అడుగుతున్నాడు.

ఒలోముచ్‌కీని అడిగితే సరేననొచ్చు. అందుకు అదనంగా చార్జి చెయ్యొచ్చు. ఆ తర్వాత ఏదో వంకన ఆ చార్జిని శాశ్వతం చెయ్యొచ్చు.

లేదా, అలా అడగడం నచ్చక – నన్ను మళ్లీ ఇల్లు ఖాళీ చెయ్యమనొచ్చు.

క్షణక్షణముల్ హౌస్‌ఫ్రౌ (లాండ్‌లేడీ) ల చిత్తముల్ – ఎలా ఉంటాయో తెలియదు.

సుందరం మా ఇంటికి రావడం ఓ తీపి జ్ఞాపకం కావాలి. అందుకని మేమిద్దరం చర్చించుకుని, ఈ విషయమై ఎలాంటి రిస్కూ తీసుకోకూడదని నిర్ణయించుకున్నాం.

"ఇండియాలో ఐతే, మారాలోచన లేకుండా హృదయపూర్వకంగా ఆ దంపతులకు స్వాగతం పలికేవాళ్లం" అని నొచ్చుకుంది శ్రీమతి.

ఐతే మనసులో కొంచెం గిల్టీ ఫీలింగ్ కూడా కలిగింది. దాన్ని అణచి పెట్టేసి – ఒలోముచ్‌కీని అడక్కుండానే – అతడు తన భార్య స్టే విషయంలో వేరే ఏర్పాటు చేసుకోవాలనీ, అందుకు అన్యథా భావించొద్దనీ బదులిచ్చాను.

దానికి సుందరం వెంటనే బదులిచ్చాడు.

"ఇందులో అన్యథా భావించడానికేముంది. మననిక్కడికి తీసుకొచ్చిన డాడ్ వాళ్లే – బెర్లిన్ నాకు మాత్రమే చూపిస్తామనీ, బస నాకు మాత్రమే ఏర్పాటు చేస్తామనీ, నేను ఆ బసలోనే ఉండాలనీ, నా భార్య నాతో వచ్చినా వేరే చోట ఉండాలనీ అన్నారు. ఇక్కడి పద్ధతులు ఇక్కడివి. ఇక్కడి ఆలోచనలు ఇక్కడివి. అలాగని మనం సరిపెట్టుకోవాలి. నేను నా భార్యని బెర్లిన్ తీసుకొచ్చే ఆలోచన మానుకున్నాను. మనం కలిసినప్పుడు చాలా విషయాలు సరదాగా పంచుకుందాం" – ఇదీ ఆ లేఖలో సారాంశం.

"సుందరం చాలా మంచివాడు. అర్థం చేసుకున్నాడు" అని తేలికగా నిట్టూర్చాను.

"మీరు తన గురించి ఇదివరకు చాలా చెప్పారు. అర్థం చేసుకోకపోయినా కూడా అతను చాలా మంచివాడే" అంది శ్రీమతి.

నిజమే.

నాకూ సుందరానికీ సుమారు ఏడాది క్రితం ఢిల్లీ విమానాశ్రయంలో జర్మనీ ప్రయాణంలో పరిచయమైంది.

విదేశయానమే కాదు, విమానయానమూ మాకు కొత్తే!

మేమెక్కిన తొలి విమానం లుఫ్తాన్సా కంపెనీదని ఇద్దరం గర్వపడ్డాం.

ఇద్దరి అభిరుచులూ, తత్వం ఒకటేనని గ్రహించి ఫ్రాంక్‌ఫర్ట్ చేరేలోగా ఆత్మీయులమైపోయాం.

అక్కడ విడిపోయేక – ఉత్తరాల్లో స్వానుభవాలు పంచుకుంటూ ఆత్మీయతను కొనసాగిస్తున్నాం.

ఇన్నాళ్లకు మళ్లీ అతణ్ణి కలుసుకుంటున్నానని నాకు చాలా ఉత్సాహం వచ్చింది.

అదే ఉత్సాహం పిల్లల్లోనూ కలిగించాలనుకున్నాను.

అందుకు నాదో స్టైలుంది.

ఉదాహరణకి పిల్లలకు కొత్త కథ చెప్పేటప్పుడు – నేను వాళ్లకి రెండు మూడు రోజుల ముందునుంచీ – అందులోని విశేషాలు కొన్ని ప్రస్తావించి ఊరిస్తుంటాను. వాళ్లు పాత కథ వింటూనే కొత్తదానికోసం ఆత్రుతగా ఎదురు చూసేవారు.

ఇప్పుడు సుందరం గురించి కూడా వాళ్లకి ఎన్నో విశేషాలు చెప్పాను. కొంత కల్పన, కొంత వాస్తవం.

మా ఇంట్లో చాలా వ్యవహారాలకి సినిమా పాటల వాడకం ఎక్కువ.

అప్పట్లో మా టేపు రికార్డర్లో ఉన్న పాటల్లో, ఉండమ్మా బొట్టు పెడతా చిత్రంలో 'పాతాళ గంగమ్మ రారా, ఉబికుబికీ ఉరికురికీ రారా, పడగెత్తే పామల్లే పైకీ పాకీ, పరుగెత్తే జింకల్లే దూకీ దూకీ' – అనే పాటకి సన్నివేశంతో అన్వయించి అర్థం చెప్పేవాణ్ణి మా పిల్లలకి.

ఇప్పుడు సుందరం రాక గురించి వాళ్లకి చెప్పి – ఆ పాటలో 'పాతాళ గంగమ్మ రారా' అన్న చరణాన్ని 'మిత్రమా సుందరం రావయ్యా' అని మార్చి, మిగతా చరణాల్లో 'రారా' అని ఉన్న చోటల్లా 'రావయ్యా' అని మార్చి పాడేవాణ్ణి.

పిల్లలకి చాలా నవ్వొచ్చేది. రెండు మూడు రోజుల్లోనే వాళ్లు అసలు పాటని మర్చిపోయి ఈ పాటనే పాడుకోసాగారు.

ఆ పాట కారణంగా వాళ్లు సుందరం రాకకోసం నాకంటే ఎక్కువ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

శ్రీమతి కూడా సుందరానికిచ్చే ఆతిథ్యం గురించి ముందుగానే ప్లాన్ వేసుకుంది.

అతగాడు నాలుగు రోజులుంటే – ఆ నాలుగు రోజులూ నాలుగు రకాల వంటకాలు, పిండివంటలు చెయ్యాలని టైంటేబుల్ కూడా వేసుకుంది. ఐతే ఆత్మీయతాభావమే తప్ప ఒకళ్లని ఇంప్రెస్ చెయ్యాలనుకునే తత్వం కాదామెది.

అతగాడు శుద్ధ శాకాహార తెలుగు వంటకాల్నే ఇష్టపడతాడనీ, ఇక్కడికొచ్చినా వాటినతడు మిస్ కాకూడదనీ ఆమె తాపత్రయం.

ఆమె టైంటేబుల్ ప్రకారం అవసరమైన దినుసుల్ని కొని ఉంచుకున్నాం.

అతగాడు రావడానికి ఇంక ఒక్క రోజే ఉందనగా, మాకు అనుకోకుండా ఓ దుకాణంలో లెబెన్స్ మిట్టెల్ (ఫుడ్ అండ్ గ్రోసరీస్) విభాగంలో దోసకాయ దొరికింది. మా కళ్లని మేమే నమ్మలేకపోయాం. ఎందుకంటే అక్కడ దోసకాయలు దొరకవు కాక దొరకవని ఎన్నో ఏళ్లుగా ఉంటున్న మిత్రులు కొందరు చెప్పారు.

శ్రీమతి ఆ రాత్రే దోసావకాయ పెట్టి, "ఈ ఐటం మీ మిత్రుడికి పెద్ద సర్‌ప్రయిజ్ ఔతుంది" అంది.

ఆమె ఉత్సుకతకి ఆశ్చర్యపడుతూనే, "ఇంతమంది వచ్చివెళ్లారు కానీ సుందరం రాక అందరి రాకకూ భిన్నంగా, అపూర్వమైన తీయని అనుభూతుల్ని కలిగిస్తుందని నాకు అనిపిస్తోంది" అన్నాను.

భిన్నమూ, అపూర్వమూ, తీపితో పాటు – కొంచెం చేదు కూడా కలిసే అవకాశముందని అప్పుడు నాకు తెలియదు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments